

# బీఆర్ఎస్ రజతోత్సవ సంబురం






ఒక్క పని కూడా చేతగాని కాంగ్రెస్ సర్కారు.. కేసీఆర్ చేసిన పనులను ఆపుతున్నది. ఒక్కటన్నా చేసిండ్రా అంటే అది ఒకే ఒక్క ఫ్రీ బస్సు! రాజకీయాల్లో సీట్ల కోసం తన్నుకుంటుంటే గమ్మతి గని.. బస్సుల్లో సీట్ల కోసం సిగపట్లకు దిగే పరిస్థితి వచ్చింది. - కేటీఆర్

## రజతోత్సవ సభకు జోరుగా ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి...

ఈ నెల 27న లక్షలాది మందితో రజతోత్సవ సభ జరుగనున్నది. సభకు వచ్చే లక్షలాది మంది ఆ ప్రాంగణంలో ఏ చివర ఉన్నా.. వేదికపై ప్రసంగించే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కనిపించేలా స్థలాన్ని ఎంపిక చేశారు. సాంకేతికంగా అన్నీ చూసుకొని వేదిక నిర్మాణం చేపట్టారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో సభ సాయంత్రం తర్వాత జరగనున్నది. అందుకు అనుగుణంగా సభా ప్రాంగణం మొత్తం వెలుగులతో ఉండేలా భారీ స్థాయిలో లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. జనరేటర్లు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. లక్షలాది మందికి కేసీఆర్ ప్రసంగం స్పష్టంగా వినిపించేలా అత్యాధునిక సౌండ్ సిస్టంను అమర్చుతున్నారు. వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతీయ, రాష్ట్ర రహదారులు, గ్రామీణ రోడ్లను అనుసంధానం చేసేలా మొరంతో అంతర్గత రోడ్లను సిద్ధం చేశారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాల నుంచి మహాసభ ప్రాంగణానికి ప్రజలు నడిచి వచ్చేందుకు అంతా చదును చేశారు. అత్యవసర వైద్య సేవలను అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా ప్రాంగణంతోపాటు దీనికి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తాత్కాలిక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా నాలుగు అంబులెన్స్‌లను సిద్ధం చేశారు. ఎల్కతుర్తి నుంచి వరంగల్, కరీంనగర్, సిద్దిపేట జాతీయ రహదారుల్లో ఒక్కొక్కటి చొప్పున, మహాసభ ప్రాంగణంలో ఒకటి చొప్పున మొత్తంగా నాలుగు అంబులెన్స్‌లను పెట్టే ప్రదేశాలను ఎంపిక చేశారు. అవసరమైన ప్రదేశానికి వెంటనే అంబులెన్స్ వెళ్లేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పనులు వేగంగా చేపడుతున్నారు.



ఎల్కతుర్తిలో సిద్ధమవుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ వేదిక, బారికేడ్లు

### రేపు కేటీఆర్ రాక

రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఎల్కతుర్తికి రానున్నారు. సభకు వచ్చే లక్షలాది మందికి అవసరమైన వసతులు, వేలాది వాహనాల పార్కింగ్‌కు అనుగుణంగా జరిగిన పనులను... అత్యవసర వైద్య వసతుల ఏర్పాట్లను పరిశీలించనున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు జన సమీకరణ ఏర్పాట్లపై వరంగల్ ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలతో సమీక్షించనున్నారు.

## 'కోబ్రా'తో కాంగ్రెస్ భూకబ్జా స్వాధీనం తథ్యం

- దోచుకునుడు..భూములు కబ్జా చేసుడే కాంగ్రెస్ ధ్యేయం
- రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): తన 25 ఏండ్ల రాజకీయ ప్రస్థానంలో ఇంత చెత్త ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో అందినోళ్లు అందినంత దోచుకుంటున్నరు తప్ప ప్రజలకు మాత్రం చేసిందేమీలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, వాళ్ల కుటుంబసభ్యులు భూములు కబ్జా చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హైడ్రా తెచ్చి ఆగం చేస్తే.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కోబ్రా పేరుతో చట్టం తెస్తామని, కాంగ్రెస్ నాయకులు కబ్జా చేసిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని తేల్చిచెప్పారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నేతల చేరికల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్తీక్‌రెడ్డి మాట్లాడారు. రాజేంద్రనగర్, చేవెళ్లలో గులాబీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తంచేశారు.

### కేసీఆర్ ఆనవాళ్లను ఎవరూ చెరపలేరు: సబిత

రేవంత్‌రెడ్డి లాంటి ఎందరు పాలకులు వచ్చినా కేసీఆర్ ఆనవాళ్లను చెరపలేరని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి స్పష్టంచేశారు. తెలంగాణ ప్రజానీకం ఆయన నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నదని చెప్పారు. ఏ ఫ్లైఓవర్ చూసినా కేటీఆరే గుర్తుకొస్తారని కొనియాడారు. అన్నింటా చిట్టచివర ఉన్న తెలంగాణను అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌కు దక్కితే..మళ్లీ చిట్టచివరికి చేర్చిన గొప్పతనం రేవంత్‌కే దక్కుతుందని ఎద్దేవాచేశారు.

# 500 రోజులైనా.. హామీల అమలేది?

మొదటిపేజీ తరువాయి...

తనకు భూములున్నాయనే కారణంతో టెండర్లు పూర్తయిన శేరిలింగంపల్లి మైండ్ స్పేస్ పార్కు మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో రైలును రద్దుచేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నేత శ్రీరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబిత, రాజేంద్రనగర్ పార్టీ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ మంచి పనులు చేసిన మహానేతల ఆనవాళ్లను ఎవరూ చెరిపేయలేరని స్పష్టంచేశారు. రాజశేఖర్‌రెడ్డి అంటే ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, చంద్రబాబు పేరు చెప్తే ఐటీ గుర్తుకొస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాతలకు రైతుబంధు, రైతుబీమా ఇంటింటికీ మంచినీళ్లు, వాడవాడలా ప్రకృతి వనాలు, 24 గంటల కరెంట్, బాలింతలకు కిట్లు లాంటి పథకాల పేర్లు వింటే కేసీఆర్ గుర్తుకువస్తారని తెలిపారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, మంచిపనులు చేసిన వాళ్లను ప్రజలు నాలుగు కాలాలపాటు గుర్తుంచుకుంటారని స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ ఆనవాళ్లను తుడిపేస్తానన్న భ్రమలో సీఎం రేవంత్‌రెడ్డి రాజుల కాలం మాదిరిగా అనాగరిక చర్యలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ నేత శ్రీరాంరెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి

### రింగు రోడ్డు లోపల గులాబీ ప్రభంజనమే

'రెండు వేల పింఛన్‌ను 4 వేలు.. రూ.10 వేల రైతుబంధును రూ.15 వేలు, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, ఆడబిడ్డలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామంటే నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు. కానీ రింగురోడ్డు లోపలవాళ్లేవరూ కాంగ్రెస్సోళ్ల మాటలను నమ్మలేదు. అందుకే వాళ్లకు ఒక్కసీటు కూడా ఇవ్వలేదు. బీజేపీ కూడా అడ్డిమారి గుడ్డిదెబ్బలా ఒక్క సీటే గెలిచింది. బీఆర్ఎస్ మాత్రం ప్రభంజనం సృష్టించింది' అని గుర్తుచేశారు.

### ఢిల్లీ పెద్దలను తీసుకొచ్చి డిక్లరేషన్లు

'కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తమను ప్రజలు నమ్ముతలేరని ఢిల్లీ పెద్దలను తీసుకొచ్చి డిక్లరేషన్లు ఇప్పించిన్రు. ఖర్గేతో చేవెళ్లలో ఎస్సీ డిక్లరేషన్.. సిద్ధరామయ్యతో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్.. వరంగల్‌లో రాహుల్‌తో రైతు డిక్లరేషన్.. హైదరాబాద్‌లో ప్రియాంకతో యూత్ డిక్లరేషన్.. తుక్కుగూడలో సభపెట్టి సోనియాగాంధీతో మొత్తం మ్యానిఫెస్టో విడుదల చేయించిన్రు.. తమకు ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రాధేయ పడితే ప్రజలు ఓటేసిండ్రు. ఇప్పుడేమైంది? తినే పళ్లెంల మన్ను పోసుకున్నట్టయింది' అని కేటీఆర్ వాపోయారు.

### పేదల ఇండ్లపైకే హైడ్రా

'కాంగ్రెస్ నాయకులు పేరుకు పెద్ద పెద్ద మాటలు చెప్తున్నరు.. ఆస్తులు కాపాడేందుకే హైడ్రా తెచ్చినమంటున్నరు.. కానీ ఎఫ్‌టీఎల్‌లో ఉన్న పొంగులేటి, చెరువు నట్టనడిమిన కట్టిన పట్నం మహేందర్‌రెడ్డి.. బఫర్‌జోన్‌లో ఉన్న రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి..చెరువు మీదున్న కేవీపీ రామచందర్‌రావు ఇండ్లను ముట్టుకోరు.. పేదోళ్ల ఇండ్లను మాత్రం రాత్రికి రాత్రే కూలగొడుతున్నరు' అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు.

### ఒక్క ఇల్లు కట్టలే

'కొత్తరేషన్ కార్డులు ఎప్పుడిస్తరు? ఒక్క ఇందిరమ్మ ఇల్లయినా కట్టిండ్రా అని ప్రశ్నిస్తే ఆహనా పెళ్లంట సినిమా తరహాలో అదిగో ఇదిగో అని ఊరిస్తున్నరు తప్ప వచ్చింది లేదు.. సచ్చిందిలేదు' అని కేటీఆర్ దెప్పిపొడిచారు. దరఖాస్తుల మీద దరఖాస్తులు తీసుకుంటూ, ప్రజలను భ్రమల్లో ముంచి పబ్బం గడుపుకొంటున్నరని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు అని చెప్పి అరపైసా కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.

### మూసీ పేరిట లూటీ

రైతుబంధు, విద్యార్థులకు స్కూటీలు, స్కాలర్‌షిప్‌లు, వృద్ధులకు పింఛన్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చేందుకు పైసల్లేవని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పునరుద్ధరణకు మాత్రం రూ.1.50 లక్షల కోట్లు వెచ్చిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని కేటీఆర్ దెప్పిపొడిచారు. మూసీ మురుగు ముసుగులో ప్రజాధనాన్ని దోపిడీ చేసేందుకు సుందరీకరణ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని విమర్శించారు. 'మూసీతో మురిసే రైతులెందరు? పెరిగే ఆయకట్టు ఎంత? వచ్చే ఉద్యోగాలెన్ని? అని అడిగితే సమాధానం చెప్పడంలేదు.. మింగ మెతుకు లేదు..మీసాలకు సంపెంగ నూనె అన్న చందంగా సోకుల కోసం ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నరు' అని దుయ్యబట్టారు.

### అప్పుడు సర్పంచ్‌లకు అవార్డులు.. ఇప్పుడు అవమానాలు

కేసీఆర్ పాలనలో అటు పల్లెలు, ఇటు పట్టణాల ప్రగతికి బాటలు వేశారని, ఊరూరా శ్మశానవాటికలు, డంప్‌యార్డులు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, పార్కులు నిర్మించారని కేటీఆర్ గుర్తుచేశారు. పట్టణాల్లో అండర్‌పాస్‌లు, హైవేలు, పెద్దపెద్ద రింగురోడ్లు వేశారని చెప్పారు. ఈ క్రమంలో దేశ జనాభాలో 3 శాతం ఉన్న తెలంగాణ 30 శాతం పంచాయతీ అవార్డులను గెలుచుకున్నదని తెలిపారు. నాడు అభివృద్ధి పనులు చేపట్టి అవార్డులు దక్కించుకున్న సర్పంచులు ఇవ్వాళ కాంగ్రెస్ పాలనలో బిల్లులు రాక అవమానాలకు గురయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు.

### గులాబీ జెండానే అండ..

బీఆర్ఎస్ ఓటమితో పార్టీ కంటే తెలంగాణ సమాజానికే ఎక్కువ నష్టం జరిగిందనేది అక్షర సత్యమని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన చారిత్రక అవసరం కనిపిస్తున్నదని చెప్పారు. గులాబీ జెండానే తమకు అండగా ఉంటుందనే విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైందన్నారు. 'రైతుబంధు తేవడం.. ఇంటింటికీ నీళ్లివ్వడం..ప్రతి పంట పొలాన్ని తడపడం.. వృద్ధులకు రూ.2 వేల పింఛన్ ఇచ్చినందుకు కేసీఆర్ ముద్రలను చెరిపివేస్తారా?' అని ప్రశ్నించారు.

### మత పిచ్చిలేపడమే బీజేపీ పని

తెలంగాణలో ఇక తమదే అధికారమని ఎగిరెగిరి పడుతున్న బీజేపీకి తెలంగాణలో స్థానం లేదని కేటీఆర్ తేల్చిచెప్పారు. మతిపిచ్చిలేపి ఓట్లు దండుకోవడమే బీజేపీ పని అని దుయ్యబట్టారు. 'తెలంగాణకు చెందిన ఆ పార్టీ పెద్దనేత హిందువులు ప్రమాదంలో ఉన్నారని అంటున్నరు.. మరి 80 శాతం జనాభా ప్రమాదంలో చిక్కుకుంటే ప్రధాని మోదీ విఫలమైనట్టే కదా' అని ప్రశ్నించారు.

### రేవంత్, మోదీ పరస్పర సహకారం

సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధాని మోదీ పరస్పరం సహకరించుకుంటూ బీఆర్ఎస్‌ను ఖతం పట్టించే కుట్రలకు తెరలేపారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కిందట తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించిన ప్రధాని మళ్లీ ఏడాది తర్వాత హెచ్‌సీయూ భూముల్లో కాంగ్రెస్ బుల్డోజర్లు దింపుతున్నదని చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. 'అమృత్ స్కాంలో రేవంత్ బావమరిది రూ.1137 కోట్ల ప్రజాధనానికి ఎసరు పెట్టారని ఆధారాలు సమర్పించినా, రెవెన్యూ మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ చేసినా ఎందుకు విచారణకు ఆదేశించడంలేదని నిలదీశారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌కు ఈడీ కేసుల్లో చార్జిషీట్లు దాఖలైనా రేవంత్ బీజేపీని పల్లెత్తు మాట అనడం లేదని.. ఇదే బడేభాయ్.. చోటే భాయ్ దృఢమైన బంధానికి నిలువెత్తు నిదర్శనమని విమర్శించారు.

### ఉప ఎన్నికలు వస్తే బీఆర్ఎస్‌దే విజయం

రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని స్పష్టంచేశారు. కాంగ్రెస్, బీజేపీని ప్రజలు బొందపెట్టడం ఖాయమని హెచ్చరించారు.

### కాంగ్రెస్ గుండెలదిరేలా కదలాలె

ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఇంటి పార్టీ పండుగకు కాంగ్రెస్ గుండెలదిరేలా గులాబీ దండు కదలాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పోచమ్మ, ఎల్లమ్మ బోనాల తరహాలో బస్తీలు, కాలనీల్లో జెండా గద్దెలను ముస్తాబు చేయాలని, లేని చోట్ల నిర్మించుకోవాలని, అవసరమున్నచోట మరమ్మతులు చేయించుకోవాలని కోరారు. ఆదివారం తెల్లారే తయారై..జెండాలను ఎగరేసి..గులాబీ కండువాలను మెడలో వేసుకొని బస్సుల్లో బయల్దేరి ఎల్కతుర్తికి రావాలని సూచించారు. సమయానికి సభా ప్రాంగణానికి చేరుకోవాలని చెప్పారు. నాయకులు ముందుండి కార్యకర్తలతో కలిసి బస్సుల్లో వెళ్లాలని కోరారు.

## రజతోత్సవ పాట సీడీ ఆవిష్కరణ

'సమర శంఖ గర్జన గెరిల్లా-ఉద్యమాల ఖిల్లా ఓరుగల్లు జిల్లా' పేరుతో బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాలకు సంబంధించిన పాట సీడీని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ పాటను చాలా బాగా రూపొందించారని ప్రశంసించారు. పాటలో కాంగ్రెస్ వైఫల్యాలను చక్కగా ఎండగడుతూనే.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో సారి తెలంగాణ సీఎం కావాలని ప్రతి తెలంగాణ బిడ్డ గుండెల్లో ఆశ ఉన్నదనే భావనను గాఢంగా ప్రతిబింబించాయని కొనియాడారు. గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్, పార్టీ నేత జోరిక రమేశ్ ఆధ్వర్యంలో ఈ పాటను రూపొందించారు. సహకరించిన ఓరుగల్లు బీఆర్ఎస్ నేత, సాహిత్యం అందించిన ఫీనిక్స్, గాయని జేరిపోతుల సంధ్య, సత్యంను కేటీఆర్ అభినందించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా నేతలు పులి రజనీకాంత్, పొలపల్లి రామ్మూర్తి, బీఆర్ఎస్వీ హనుమకొండ జిల్లా కో ఆర్డినేటర్ గండ్రకోట రాకేశ్ యాదవ్, పార్టీ యువజన నాయకుడు బొల్లెపల్లి కమల్ కుమార్ పాల్గొన్నారు.

## కేసులకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడరు

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆగడాలను సహించం
- బరాబర్ అకౌంట్స్ సెటిల్ చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే షకీల్ హెచ్చరిక

బోధన్, ఏప్రిల్ 20: కేసులకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడరని బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ తెలిపారు. రాజకీయ కక్షతోనే తన కుటుంబాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ మానసిక వేదనకు గురిచేశాడని ఆరోపించారు. ఆదివారం బోధన్‌లోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డి ఆగడాలను సహించేది లేదని, బరాబర్ ఆయన అకౌంట్స్ సెటిల్ చేస్తామని హెచ్చరించారు. పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని, దీనిపై పోలీస్ కమిషనర్ స్పందించాలని కోరారు. రజతోత్సవ సభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షకీల్

## చరిత్రలో నిలిచిపోయేలా ఎల్కతుర్తి సభ

**ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు**

మహబూబాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని, ఆ మేరకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మహబూబాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. దాదాపు రెండు వేల ఎకరాల వరకు భూములను చదును చేసి సభా వేదిక, కార్యకర్తలు కూర్చునేందుకు వీలుగా సభాస్థలి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దాదాపు 50 వేల వాహనాలు వస్తాయని అంచనా వేశామని, అందుకు అనుగుణంగా పార్కింగ్‌కు స్థలం కేటాయించినట్టు చెప్పారు. సభకు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేందుకు మూడు వేల ఆర్టీసీ బస్సులు, ఆరు వేల ప్రైవేట్ బస్సులు, ఇతరత్రా వాహనాలు సమకూరుస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.



## రజతోత్సవ సభకు రండి..

- ఇంటింటికి వెళ్లి బొట్టుపెట్టి ఆహ్వానించిన 'సీతాలక్ష్మి'
- 27నాటి సభ విజయవంతానికి విస్తృత ప్రచారం

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 20: 'ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రండి' అంటూ కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి కోరారు. ఈ మేరకు తన భర్త, టీబీజీకేఎస్ నేత కాపు కృష్ణ సహా పార్టీ శ్రేణులతో కలిసి భద్రాద్రి జిల్లా కేంద్రంలోని రామవరంలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి బొట్టుపెట్టి మరీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్.. భవిష్యత్ ప్రణాళికపై దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు.



రజతోత్సవ సభకు రావాలని బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న కాపు సీతాలక్ష్మి



## 27న గులాబీదండు కదలాలి

ఆదివారం ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న సభకు భారీగా తరలివెళ్లాలని వారు పిలుపునిచ్చారు. - ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

## ఎల్కతుర్తి సభకు వేలాదిగా తరలివెళ్లాలి

**కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పిలుపు**

మాచారెడ్డి, ఏప్రిల్ 20 : ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు తరలివెళ్లాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా ఎక్స్‌రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి మాచారెడ్డి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని, ప్రజలు బీఆర్ఎస్‌తోనే ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు.

## రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలిరావాలి

- అధికార పక్షానికి దడ పుట్టించాలి
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 20 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి, వజినేపల్లి, గొర్లవీడు, కొంపెల్లి గ్రామాల్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఒకే వేదికపై లక్షలాది మంది జై తెలంగాణ అని నినదిస్తే అధికార పక్షానికి దడ పుట్టాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను సాధించి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ పాలనలో విఫలమైందని ఆరోపించారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్‌ను కాదని రేవంత్‌రెడ్డిని నమ్మి మోసపోయామని కంటతడి పెడుతున్నట్టు చెప్పారు.ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని అడిగితే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. రజతోత్సవ సభ కోసం వాల్ రైటింగ్ చేయిస్తే కాంగ్రెస్ నాయకులు వాటిని తుడిచివేయిస్తున్నారని మండిపడ్డారు.ఈ నెల 26న నిర్వహించే జాబ్ మేళాను కావాలనే 27వ తేదీకి మార్చి పోలీసు అధికారులతో ప్రచారం నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి గానీ ఇలాంటి దిక్కుమాలిన పనులేంటని ప్రశ్నించారు.కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలని, లక్షలాదిగా రజతోత్సవ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాగా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభా స్థలిని మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ

## సభకు ఇంటికొకరు తరలిరావాలి

- ఎల్కతుర్తి సభ చరిత్రాత్మకమైనది
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 20 : బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ఇంటికొక్కరు చొప్పున తరలిరావాలని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభా ప్రాంగణంలో ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్కతుర్తి సభ చరిత్రాత్మకమైనదని అన్నారు. ఉద్యమ సమయంలోనూ ఇప్పుడూ బహిరంగ సభలకు కేసీఆర్ పిలుపునిస్తే లక్షలాదిగా ప్రజలు తరలివస్తారని, అందుకు కేసీఆర్ పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసమే కారణమని అన్నారు. గడిచిన 16 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపు మాటలతో ప్రజలను మోసం చేస్తూనే ఉన్నదని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించడం కాంగ్రెస్ నైజమని దుయ్యబట్టారు. ప్రపంచం మెచ్చుకునే రీతిలో కేసీఆర్ కాళేశ్వరం కట్టి తెలంగాణలో సాగు, తాగునీటికి కొదవ లేకుండా చేశారని, ఫలితంగా అద్భుతమైన పంటలు పండేట్లు చూశారని గుర్తుచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కండ్లు బైర్లు కమ్మేలా రజతోత్సవ సభ

- ఏడాదిన్నరలోనే పాలనపై చేతులెత్తేసిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 20: కాంగ్రెస్ కండ్లు బైర్లు కమ్మేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహించబోతున్నట్టు మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. ఆదివారం ఆయన మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు చీమలదండులా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. ఉద్యమనేత కేసీఆర్ గాంధేయ పద్ధతిలో పోరాడి రాష్ట్రాన్ని సాధించారని, ముఖ్యమంత్రిగా పదేండ్లపాటు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని అన్నారు.



మాట్లాడుతున్న బాల్క సుమన్